క్లుప్తంగా

అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



వీసీ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న వెంకటరమణ

అమలాపురం రూరల్: మండలంలోని భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగ అధిపతిగా పనిచేస్తున్న బొడ్డపల్లి వెంకటరమణ ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఆంధ్ర యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్స్ పి.మల్లికార్జునరావు, డాక్టర్ అరుణ గైడెన్స్‌లో డిజైన్ అండ్ పెర్ఫార్మెన్స్ అనాలసిస్‌లో ఆయన సమర్పించిన థీసిస్‌కు డాక్టరేట్ ఇచ్చారని కళాశాలల చైర్మన్ బోనం కృష్ణ సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటరమణను కళాశాల అధినేత బోనం కనకయ్య, ప్రిన్సిపాల్ జీవీసీ రామారావు, ఏఓ జక్కం కృష్ణారావు, సీనియర్ ప్రొఫెసర్ డీవీవీ ప్రసాద్ అభినందించారు.

వేతనాల పెంపు ఉత్తర్వుల జారీ

యానాం: విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న వివిధ కేటగిరీలకు చెందిన కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలను పెంచుతూ కార్యదర్శి జయరాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. బాలసేవిక కండక్టర్లకు రూ.18వేలు, బాలసేవికకు రూ.22 వేలు, ఫైన్‌ఆర్ట్స్, పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ టీచర్లకు రూ.26 వేలు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్, లైబ్రేరియన్, పీఈటీలకు రూ.30 వేలు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్(ఒకేషనల్)లకు రూ.40 వేలుగా వేతనాలను నిర్ణయించారు. పెంచిన వేతనాలు ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయన్నారు.

ఉద్యోగాలకు పలువురి ఎంపిక

యానాం: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 146 యూడీసీ(అప్పర్ డివిజన్ క్లర్క్) పోస్టులకు జూలై 23న నిర్వహించిన పోటీ పరీక్షల ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. యానాం నుంచి పైడికొండల యోగ శుభాకరబాబు, ముత్యాల శ్రీరమ్య, చోడె దుర్గాప్రసాద్, జీజీ జ్ఞానేశ్వర శర్మ, కరెడ్ల అరుణాదేవి, గొర్రెల శ్రీచరిత, కడింశెట్టి సుషాంత్‌రెడ్డి, మాగాపు చంద్రరేఖ, గ్రంధి వెంకట సర్వేశ్వర సందీప్‌కుమార్, ఎస్.గాయత్రి, యెడ్ల ధరణి, సాలగ్రామ వెంకటసీత తేజస్వి, సీహెచ్ కాశీకృష్ణ, కరెడ్ల వెంకటరమేష్ ఎంపికయ్యారు.

వచ్చే నెల 15న వ్యవస్థాపక దినోత్సవం

అమలాపురం రూరల్: వచ్చే నెల 15న గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పేదలకు ట్రై సైకిళ్లు, కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే రమణారావు అన్నారు. జనుపల్లిలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 15న రక్తదాన శిబిరం సైతం ఏర్పాటుచేస్తామన్నారు.

యువతి అదృశ్యంపై కేసు



నాగవిజయ

యానాం: పట్టణ పరిధిలోని యూకేవీ నగర్ 4వ క్రాస్ వీధికి చెందిన 20 ఏళ్ల యువతి సోమిశెట్టి నాగ విజయ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేరు నూకరాజు మంగళవారం తెలిపారు. ఈ నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లిన నాగవిజయ అప్పటి నుంచి కనిపించడం లేదని ఆమె తండ్రి సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆచూకీ తెలిసినవారు 0884-2321210, 0884-2321233 ఫోన్ నెంబర్లలో తెలియజేయాలని కోరారు.

ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి



ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి

అల్లవరం: జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండుతున్న యువతీయువకులు ఓటు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి అన్నారు. ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఓటు నమోదుపై స్వీప్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ విష్ణు స్వరూప్, తహసీల్దార్ సాంబశివప్రసాద్, ప్రిన్సిపాల్ చంద్రమౌళి, డీన్ జనార్ధనరావు, ఆర్‌ఐ దుర్గా శ్రీనివాస్ పాల్గొన్నారు.

నివాసాల చెంత.. కాలుష్య చింత..

- రసాయనిక వ్యర్థాలతో ప్రబలుతున్న వ్యాధులు
- అసంపూర్తిగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం

యానాం: పేరుకే పంట కాలువది.. కాలువలో నీటి కంటే రసాయనాల గాఢతే ఎక్కువ. పైగా అది నివాసాల చెంతనే పారుతుంటుంది. దీంతో అక్కడ నివసించే ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. ఇదీ యానాం నియోజకవర్గంలోని దొమ్మేటిపేట ఇండస్ట్రియల్ కాలనీవాసుల దుస్థితి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి సమస్యను పరిష్కరించాలని మొరపెట్టుకుంటున్నా పట్టించుకునేవారు కరవయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటిపై తెట్టులా రసాయనాలు

నియోజకవర్గ శివారు దొమ్మేటిపేటలో సుమారు 700 కుటుంబాలు చాలా ఏళ్లుగా స్థిర నివాసం ఏర్పాటుచేసుకుని జీవిస్తున్నారు. ఇక్కడే అట్టల తయారీ ఫ్యాక్టరీలు, రైస్ మిల్లులు, గోదావరి కాస్టింగ్స్ వంటి పరిశ్రమలున్నాయి. అయితే రసాయనిక వ్యర్థాలను శుద్ధి చేసి బయటకు వదలాల్సి ఉన్నా అక్కడ ఉండే చాలా పరిశ్రమలు ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదు. నిబంధనలను గాలికొదిలేసి రసాయనిక వ్యర్థాలను నేరుగా దొమ్మేటిపేటలో పంటకాలువ డ్రెయిన్‌లోకి వదిలేస్తున్నారు. రసాయనాలు పంట కాలువపై తెట్టులా తేలుతున్నాయంటే అక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవొచ్చు. ఇంట్లో వాడుకునే వస్తువులు ముఖ్యంగా రాగి, అల్యూమినియం, స్టీలు తదితర వస్తువులు రంగు మారిపోతున్నాయంటున్నారు. దీనివల్ల రసాయనిక వ్యర్థాల దుర్వాసనను పీలుస్తూ అక్కడే నివసిస్తున్న ప్రజలు వ్యాధులబారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రధానంగా శ్వాసకోశ, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు, చర్మవ్యాధులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.



పంట కాలువలో తెట్టులా తేలుతున్న రసాయనిక వ్యర్థాలు

ఏళ్లుగా పూర్తికాని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ

దొమ్మేటిపేట వాసుల ఇబ్బందులను తొలగించేందుకు 2016లోనే రూ.67 లక్షల మున్సిపాలిటీ నిధులతో అండర్‌గ్రౌండ్ నిర్మాణం ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న డ్రెయిన్‌లోకి ప్రవహిస్తున్న రసాయనిక వ్యర్థ జలాలను అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ద్వారా సుమారు కిలోమీటరు దూరం తరలించి అక్కడి నుంచి పంపింగ్ ద్వారా బయటకు పంపాలన్నది లక్ష్యం. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది.



అసంపూర్తిగా నిలిచిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు

త్వరలో పరిష్కారం



వివిధ పరిశ్రమల ద్వారా వచ్చే వ్యర్థ జలాలు దొమ్మేటిపేట పంటకాలువలోకి వస్తున్నాయి. ఈ సమస్యపై ఇప్పటికే పుదుచ్చేరి డ్రైనేజీ విభాగం, పీడబ్ల్యూడీ అధికారులతోనూ మాట్లాడాను. వ్యర్థాలను పంట కాలువలోకి వదలడానికి లేదని ఆదేశించాను. సమస్య త్వరలో పరిష్కరమవుతుంది.

– గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎమ్మెల్యే, యానాం

విద్యార్థులు చదువును క్రీడలా భావించాలి



సర్వేశ్వరశర్మను సత్కరిస్తున్న డేవిడ్ కొమానపల్లి

అమలాపురం టౌన్: విద్యార్థులు చదువును క్రీడలా భావించి ఇష్టపడి చదవాలని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. మంగళవారం స్థానిక నల్లవంతెన సమీపంలోని పరంజ్యోతి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ముగింపు సందర్భంగా జరిగిన సభకు సర్వేశ్వరశర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం సర్వేశ్వరశర్మను మన్నా విద్యా సంస్థల అధినేత డేవిడ్ కొమానపల్లి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నూకపెయ్యి ఆదిలక్ష్మి, మిరియాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నల్లా తమ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఫూలే

అమలాపురం టౌన్: మహాత్మా జ్యోతీరావు ఫూలే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కేతా భాస్కర రామారావు అన్నారు. స్థానిక మున్సిపల్ పార్కు వద్ద గల ఫూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడు రాజులపూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అల్లుమిల్లి శ్రీనుబాబు, ఉపాధ్యక్షుడు జీవీ రమణ, నగభేరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మహాత్మా జ్యోతీరావు ఫూలే వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి ఎన్.శంకర్‌నారాయణ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టి.ఈశ్వరరావు, పెయ్యల రమేష్, వడ్డి ఏడుకొండలు, అత్తిలి బాబూరావు, ఆకుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మహాత్మ జ్యోతీరావు ఫూలే ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని అమలాపురం మార్కెట్ కమిటీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు అన్నారు. ఫూలే 133వ వర్ధంతి సందర్భంగా అమలాపురం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు యనమదల పల్లంరాజు, శీలం సూరిబాబు, గుత్తుల శ్రీనివాసరావు, చప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు ఉప్పలగుప్తంలో ఉన్న ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఉప్పలగుప్తంలో ఫూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు



తాళ్లరేవులో ఫూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు



అమలాపురంలో ఫూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు



ఫూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

యానాం: జ్యోతీరావ్‌ఫూలే వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఐటీఐ ఆవరణలో ఫూలే విగ్రహానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, సీఐ షణ్ముగం, ట్రాఫిక్ ఎస్‌ఐ పువ్వల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న లేగ దూడల ప్రదర్శన

తాళ్లరేవు: మండలంలోని పత్తిగొంది వెటర్నరీ ఆస్పత్రి వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన లేగ దూడల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమానికి ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పశువుల ఆరోగ్యానికి సంబంధించి ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న పశు సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లేగ దూడల ప్రదర్శనలో స్థానిక రైతు గొల్లపల్లి వీర్రాజుకు చెందిన గిర్ జాతి ఆవు ప్రథమ బహుమతి సాధించింది. విజేతలకు నాయకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దున్నా సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్ధనరావు, ఎంపీటీసీ సభ్యుడు దున్నా రాంబాబు, ఉపసర్పంచ్ పంపన రామకృష్ణ, వెటర్నరీ వైద్యురాలు పశు వైద్యురాలు భవాని, సుధ పాల్గొన్నారు.



ప్రదర్శనలో ప్రథమ బహుమతి సాధించిన గిర్ జాతి ఆవుతో నాయకులు

కార్తిక దీపోత్సవం

తాళ్లరేవు: మండలంలోని పి.మల్లవరం శ్రీదేవీ భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం రాత్రి కార్తిక దీపోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి రంగాచార్యులు, శ్రీనివాసాచార్యులుచే స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో కార్తిక దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో ధూళిపూడి సతీష్, ఉంగరాల వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాస్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తిక దీపోత్సవం

సంక్షేమ పథకాలతో ఇంటింటా వెలుగులు

- మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్
- ఇందుపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

అమలాపురం రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఇంటింటా వెలుగులు నిండుతున్నాయని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. ఇందుపల్లి సచివాలయం పరిధిలోని గరువు బొంతువారిపేటలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందజేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుందామన్నారు. బొంతువారిపేటలో రూ.10 లక్షలతో చేపట్టిన అంబేడ్కర్ కమ్యూనిటీ హాలుకు శ్రీకాంత్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు కుడుపూడి నాగరాజు, చొల్లంటి రాధాకృష్ణ, పెదపూడి ఏడుకొండలు, గుత్తుల సత్యనారాయణ, బొంతు రామచంద్రరావు, కుడుపూడి ప్రసాద్, చొల్లంగి బాలరాజు, నాగబత్తుల కొండ, పెదపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఇందుపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికీ చేరాలి

యానాం: కేంద్ర ప్రభుత్వ పథకాలు పేద, బడుగు, బలహీన వర్గాలకు అందేలా ప్రభుత్వ శాఖల సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం వద్ద వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రచార వాహనాన్ని ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్‌భారత్, పీఎం గరీబ్ కల్యాణ యోజన, పీఎం ఉజ్వల యోజన, స్టాండ్ అప్ ఇండియా, పీఎం విశ్వకర్మ, కిషాన్ సమ్మాన్ నిధి, ప్రణామ్ తదితర పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కనకాలపేట ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రచార వాహనాన్ని ఉంచి వివిధ పథకాల కార్యక్రమాలను ప్రదర్శించారు. పలువురికి గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, బీజేపీ అధ్యక్షుడు కనకాలరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

- ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్



ఎస్.కొత్తపల్లిలో పార్టీ జెండాను అవిష్కరిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: సంక్షేమ పథకాలు ఆగకుండా అందాలంటే మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అన్నారు. స్థానిక మార్కెట్ ప్రాంత వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. తొలుత స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పాదయాత్ర చేశారు. వార్డు సచివాలయం వద్ద సంక్షేమ పథకాల లబ్ధి సమాచార ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, కౌన్సిలర్లు దొంగ నాగసుధారాణి, కొల్లాటి దుర్గాబాయి, చిత్రపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలందరూ ముక్త కంఠంతో కోరుకుంటున్నారని ఎంపీపీ మోర్తరాణి మిరియంజ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజులు అన్నారు. గుత్తినదీవిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మోర్త చిన్నా, కొండేపూడి కృపావరప్రసాద్, పిన్నంరాజు బాబ్జిరాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఈ రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. గుండెపూడి సచివాలయం వద్ద ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ బోర్డుని అవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, జీఎస్‌కే కన్వీనర్ తిక్కా ప్రసాద్, ఎంపీటీసీలు మాకే కృష్ణమూర్తి, గుబ్బల బాబ్జి, రాజేశ్వరి, మాజీ సర్పంచ్ పినిపే ప్రకాశరావు, గుంటూరి కృష్ణంరాజు పాల్గొన్నారు.



అమలాపురంలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని ఎస్.కొత్తపల్లి సచివాలయం-2 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జెడ్పీటీసీ సంపదరావు సచివాలయ పరిధిలో ప్రజలకు అందిన సంక్షేమాల పట్టికను ప్రారంభించారు. అనంతరం పార్టీ జెండాను గ్రామ పార్టీ ఇన్‌చార్జ్ మోటూరి సత్యం కాపు అవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంచే చిట్టికుమారి, సొసైటీ అధ్యక్షుడు నండింపల్లి వాసురాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి, మండల జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజు, బొడ్డు నాగేశ్వరరావు, కుంచే చిన్ని, అంగాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: గత ఎన్నికల్లో ఇచ్చిన 99 శాతం హామీలను ప్రభుత్వం అమలుచేసిందని అమలాపురం ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం బండారులంక సచివాలయం పరిధిలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డును జెడ్పీటీసీ పందిరి శ్రీహరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెనుమాల సునీత, ఎంపీటీసీ గుత్తుల జానకి లక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ పిచ్చిక శాంతి, దంగేటి బల్లబ్బులు, గుత్తుల సత్తిబాబు, కాసిన చిట్టిరాజు, మట్టపర్తి బూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగుతుందని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బొండాయికోడు సచివాలయం వద్ద నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. నగర పంచాయతీ పరిధిలో అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాల డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోటుం జయలక్ష్మి, కమిషనర్ జి.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



గుండెపూడిలో ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేతలు



గుత్తినదీవిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మోర్తరాణి మిరియంజ్యోతి



ముమ్మిడివరంలో సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్



బండారులంకలో సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించిన డోలామణి తదితరులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



గాడిమొగలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ గోవలక్ష్మి తదితరులు

తాళ్లరేవు: మండలంలోని గాడిమొగ పంచాయతీ పరిధిలో సుమారు రూ.32 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ కామాడి గోవలక్ష్మి మంగళవారం శంకుస్థాపన చేశారు. పెదవలసల ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి ఓలేటి అర్జునరావు ఇంటి వరకూ రూ.4.65 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం, భద్రకాళీ గుడి నుంచి గ్రావెల్ లెవలింగ్‌కు రూ.10 లక్షలు, స్థానిక అర్ధాడి మహాలక్ష్మి ఇంటి నుంచి పరదేశమ్మ గుడి వరకూ రూ 4.63 లక్షలతో గ్రావెల్ రహదారి, లక్ష్మీపతిపురంలో వాడపర్తి మంగమ్మ ఇంటి నుంచి కాలువ వరకూ రూ.3.20 లక్షలతో డ్రైనేజీ, రూ.5 లక్షలతో గాడిమొగ స్నానాలరేవు అభివృద్ధి, చినవలసలలో రూ.5 లక్షలతో అంతర్గత రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, వార్డు సభ్యులు పి.ఈశ్వరి, కె.తాతారావు, కృష్ణజ్యోతి, బుజ్జి, పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ, కామాడి మాతరాజు పాల్గొన్నారు.

జ్వర బాధితుడికి ప్లేట్‌లెట్స్ దానం

అమలాపురం టౌన్: డెంగీ జ్వరంతో బాధపడుతూ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగికి ఆజాద్ ఫౌండేషన్ సభ్యుడు మాతంశెట్టి గుప్తా మంగళవారం ప్లేట్‌లెట్స్ దానం చేశారు. ఈ సందర్భంగా గుప్తాను ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యల్లమిల్లి నాగసుధా కొండలరావు అభినందించారు.